అటవీ నర్సరీపై నిర్లక్ష్యం

- చీకటి కార్యకలాపాలకు నిలయంగా పెడిమికొండ అటవీ నర్సరీ
- నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన విశ్రాంతి భవనం షెడ్లు
- ఉమ్మడి రాష్ట్రంలో అవార్డు అందుకున్న నర్సరీ
- ఉపాధి హామీ పథకంలో అరకొరగా మొక్కల పెంపకం


ఉపాధి నిధులతో అరకొరగా పెంచుతున్న మొక్కలు


ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైను


నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు


కూలేందుకు సిద్ధంగా విశ్రాంతి భవనం


రోడ్డును అనుకుని నర్సరీ ప్రధాన గేటు


శిథిలావస్థలో ఉష్ణోగ్రత పెంచే షెడ్లు

నాతవరం : పెడిమికొండ అటవీ నర్సరీని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారింది. మండలంలో గాంధీనగరం సమీపంలో నర్సీపట్నం తుని మధ్య అర్‌అండ్‌బీ రోడ్డును అనుకొని పెడిమికొండ అటవీ నర్సరీ ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 1956లో వందలాది ఎకరాల విస్తీర్ణంలో అటవీ నర్సరీని ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా వివిధ రకాల లక్షలాది మొక్కలు పెంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు నర్సరీలకు సరఫరా చేసేవారు. మిగిలిన మొక్కలను ప్రైవేటు వ్యక్తులకు అందించేవారు. ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీ 11 మండలాలతో కంటే నాతవరం మండలం పెడిమికొండ అటవీ నర్సరీలో వివిధ జాతుల మొక్కలు పెంచేందుకు వాతావరణం అన్ని విధాలుగా బాగుంటుందని అప్పట్లో అధికారులు నిర్ధారించారు. గతంలో ఈ నర్సరీలో మొక్కలు పెంచేందుకు కావలసిన సాంకేతిక విజ్ఞానంతో కూడిన మేటీరియల్ కూడా ఏర్పాటు చేశారు. వేసవిలో మొక్కలకు ఉష్ణోగ్రత తగ్గించేందుకు అవసరాన్ని బట్టి పెంచేందుకు కావలసిన ప్రత్యేకంగా షెడ్లు రూపంలో నిర్మించారు. అప్పట్లో అటవీశాఖ అధికారులు ఆశయాలకు అనుగుణంగా మొక్కలు పెంచేవారు. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందిన సందర్భాలు కూడా పెడిమి కొండ అటవీ నర్సరీకి ఉంది.

గతంలో ఎంతో ప్రాముఖ్యత

ఈ నర్సరీలో మండు వేసవిలో సైతం పుష్కలంగా నీరు సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా బోర్లు ట్యాంకులు ఏర్పాటు చేశారు. ఈ నర్సరీకి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా కోసం అదనపు లైను ఏర్పాటు చేశారు. అటవీశాఖ ఉన్నతాధికారులు నర్సరీ పరిశీలనకు వచ్చినప్పుడు విశ్రాంత్రి తీసుకునేందుకు ప్రత్యేకంగా గెస్టిహౌస్ నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ కొత్తగా నర్సరీ ఏర్పాటు చేయాలన్నా ఇక్కడ శిక్షణ తీసుకునేందుకు అనేక మంది వచ్చేవారు. ఈ నర్సరీ నిర్వహణ ఉన్న సమయంలో గాంధీనగరం, మర్రిపాలెం, వెన్నలపాలెం, డి.యర్రవరం, శృంగవరం గ్రామాల్లో అనేక మందికి కూలి పని రూపంలో ఉపాధి ఉండేది. అంతటి ప్రాముఖ్యత కలిగిన నర్సరీని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో నిరుపయోగంగా దర్శనమిస్తుంది.

నేడు నిర్వహణ గాలికి...

లక్షలాది రూపాయలతో నిర్మించిన విశ్రాంతి భవనం వాటర్ ట్యాంకులు, కుళాయిలు, సిమెంటు కుండీలు, ఇతర షెడ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. నర్సరీని అభివృద్ధి చేసేందుకు కావలసిన నిధులు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే కన్పిస్తుంది. దీంతో నర్సరీ విష జంతువులకు నిలయంగా మారిందని ఈ ప్రాంతీయులు భయాందోళన చెందుతున్నారు.

నర్సరీ ప్రాంగణంలో అసాంఘిక కార్యకలాపాలు

నర్సీపట్నం తుని అర్‌అండ్‌బీ రోడ్డుని అనుకుని పెడిమికొండ అటవీ నర్సరీ ఉండడంతో చీకటి కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పార్కును తలపించేలా పచ్చని చెట్ల ఆహ్లాదకరంగా ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వాహనాలపై వచ్చిన వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలక్షేపం చేస్తున్నారు. ఆదివారం వస్తే మద్యం బాబులు పేకాట రాయుళ్లు, ప్రేమికులు జంటలు ఇక్కడ దర్శనమిస్తుంటారు. గతంలో పోలీసులు నిఘా పెట్టి దాడులు చేయడంతో కొంతకాలం అసాంఘిక కార్యకలాపాలు తగ్గాయి. ప్రస్తుతం మళ్లీ పర్యవేక్షణ కొరవడి చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారింది.

ప్రత్యేకంగా నిధులు లేవు



పెడిమికొండ అటవీ నర్సరీని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు రాలేదు, ఉపాధి హామీ పథకంలో ఈఏడాది వివిధ జాతుల మొక్కలు 50 వేలు పెంచుతున్నాం. అవి ఇంకా పెరగాలి. పంపిణీ చేయడానికి సమయం పడుతుంది. నర్సరీ అభివృద్ధికి నిధులు ఇస్తే పూర్వ వైభవం తీసుకువస్తాం. ప్రస్తుతం టేకు ప్లాంటేషన్‌కు దిమ్మలు తయారు చేశాం.

– చిరంజీవి,
అటవీ సెక్షన్ అధికారి, నాతవరం మండలం

క్లుప్తంగా

తురువోలులో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


తురువోలు జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న నేతలు

చీడికాడ : తురువోలు గ్రామంలో మహాజన సోషలిస్టు పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్పీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వై.గాటీలు ఆధ్వర్యంలో సోమవారం ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మందా కృష్ణ పోరాట ఫలితంగా వర్గీకరణ సాధించడం ద్వారా మాదిగ జాతికి మరో అభినవ అంబేద్కర్‌గా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఈశ్వరావు, కె.వెంకట్రావు, ఎం.శ్రీనివాసరావు, కలిగొట్ల కన్నయ్య, వెంకట్రావు, రుతమ్మ పాల్గొన్నారు.

సత్యవరంలో సుపరిపాలనలో తొలిఅడుగు

మాడుగుల: సత్యవరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గృహనిర్మాణ, సమాచార శాఖా మాత్యులు, కొలుసు పార్థసారధి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఉచిత గ్యాస్ డబ్బులు పడలేదని, గ్రామానికి చెందిన మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మంత్రి సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, హౌసింగ్ బోర్డు చైర్మన్ తాతయ్యబాబు, ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ నాగమణి పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

అనకాపల్లి టౌన్: క్లాప్ డ్రైవర్స్‌ను ఆప్కోస్‌లో చేర్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్ బీవీ రమణకు వినతిపత్రం అందజేశారు. క్లాప్ సూపర్‌వైజరు, డ్రైవర్లు, క్లాప్ లోడర్స్‌కు సుప్రీం కోర్టు ఆదేశాలననుసరించి సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు.

కొండెంపూడి కేవీకేలో రైతులకు శిక్షణ


కొండెంపూడి రైతు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న షేక్ యన్ మీరా

బుచ్చెయ్యపేట: మండలంలో కోండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో రెండురోజులు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఉత్తర కోస్తా, గోదావరి జోన్ అలాగే ఉన్నత పర్వత శ్రేణి జోన్లకు సంబంధించి విస్తరణ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అటారిజోన్ టెన్ డైరెక్టరు అయిన డాక్టర్ షేక్ యన్ మీరా, సిహెచ్.ముకుందరావు, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఉప విస్తరణ సంచాలకుడు ముకుందరావు మాట్లాడుతు సోలార్ వినియోగం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సముపార్జించడానికి అవసరమైన సూచనలు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో 52 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

డీ పట్టాదారులకూ అన్నదాత సుఖీభవ అందించాలి


ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రోలుగుంట : మండలంలో పలు గిరిజన గ్రామాల్లో డీ పట్టాభూములున్న లబ్ధిదారులకు అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత కల్పించాలంటూ నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం సీపీఎం నాయకుడు కె.గోవింద వినతి పత్రం అందజేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం రెవిన్యూ డివిజన్ పరిధిలో రోలుగుంట మండలం పనసలపాడు, రావికమతం మండలం కవుగుంట, కొట్నాబిల్లి, రెవెన్యూ పరిధిలో 70 మంది గిరిజన రైతులు, 16 మంది దళిత రైతులు జీడి మామిడి తోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి కోట్నాబిల్లి రెవిన్యూ పరిధిలో రామన్నదొరపాలెం పీవీటీజీ గదబపాలెంకు చెందిన 16 మంది రైతులకు 1976లో సీలింగ్ భూములకు పట్టాలిచ్చారు. 1984లో కె.గదబపాలెంతో పాటు కవ్వగుంట రెవెన్యూ పరిధిలో 30 మందికి డీ పట్టాలిచ్చారు. గర్నికం రెవిన్యూ పరిధిలో 16 కుటుంబాల వారికి 1986లో పట్టాలిచ్చారు. జగనన్న భూ రీసర్వేలో సాగులో ఉండి పట్టా కలిగి ఉన్నారని రెవిన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. అయితే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితాలో వీరి పేర్లు లేవని తెలిపారు. ఆయా రైతులకు న్యాయం చేయాలని కోరారు.

పరిష్కార వేదికలో 22 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏవో సుధాకర్

నర్సీపట్నం:ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 22 ఫిర్యాదులు వచ్చాయని ఏవో సుధాకర్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయ పని మీద ఫీల్డ్‌కు వెళ్లడంతో పరిష్కార వేదికలో ఏవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, రేషన్ కార్డులు, సదరం సర్టిఫికెట్లు, పింఛన్లకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయి. వీటిని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఏవో అర్జీదారులకు తెలిపారు.

కె.నాయుడుపాలెంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్

రోలుగుంట : దేశంలో గల అన్ని రాష్ట్రాల కన్నా ఆయిల్‌పామ్ సాగుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాగుకు అనుకూలమని, ఈ పంట సాగుకు రాయితీపై యంత్రాలు, శతశాతం రాయితీపై మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ఏజీఎం పట్టాభిరామిరెడ్డి అన్నారు. కె.నాయుడుపాలెం గ్రామంలో రైతు పైల రవి పంటభూముల వద్ద సోమవారం ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవ కార్యక్రమాన్ని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పామ్ ప్లాంటేషన్ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సభలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ రాయితీపై ఇస్తున్న యంత్రాలు, పంట సాగుకు ఎంతో సాయమందిస్తోందని ఈ అవకాశం సాగుదారులు వినియోగించుకోవాలన్నారు. ఏజీఎం పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ కంపెనీ రైతులకు మొక్కలు పంపిణీ నుంచి పండించే పంటను విక్రయించే వరకూ అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. ఎరువుల నిమిత్తం హెక్టారుకు ఏడాదికి రూ.5250 చొప్పున నాలుగు సంవత్సరాలు పాటు అందిస్తుందన్నారు. సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్, ఉద్యానశాఖాధికారి శిరీష, మండల వ్యవసాయాధికారి చిరంజీవి కొండబాబు, పామ్ అయిల్ కంపెనీ సిబ్బంది, రైతు నాయకులు చంద్రమౌళి, పంచాడ చంద్ర పాల్గొన్నారు.

మేలురకం పశుగ్రాసంతో అధిక దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల పశుసంవర్ధకశాఖ అధికారి నాగశివకుమార్


దేవరాపల్లిలో పశు గ్రాస సాగు విధానంపై రైతులకు వివరిస్తున్న పశువైద్యాధికారి గాయత్రీదేవి

మాడుగుల రూరల్: మేలు రకం పశుగ్రాసం పెంపకంతో అధిక పాల దిగుబడి సాధించవచ్చునని మండల పశుసంవర్ధకశాఖ అధికారి కె.నాగశివకుమార్ పేర్కొన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా వీరనారాయణం గ్రామంలో రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ నెల 14 వ తేదీ వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో భాగంగా, సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, జొన్న, పిల్లిపెసర వంటి వాటిని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో పచ్చి మేత ప్రాముఖ్యత గురించి, శాస్త్రీయ పద్ధతిలో పశుగ్రాసాలను పెంచే విధానాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వీరనారాయణం గ్రామానికి చెందిన పాడి రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : పాడి పశువులకు మేలైన, నాణ్యమైన పశు గ్రాసాన్ని పచ్చి మేతగా అందించడం ద్వారా పాల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని మండల పశు వైద్యాధికారి జి.గాయత్రీదేవి అన్నారు. దేవరాపల్లిలో పశుగ్రాస వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం పాడి రైతులకు అవగాహన కల్పించారు. పాడి పశువులకు ఇచ్చే పచ్చిమేతలో విటమిన్-ఏ అధికంగా ఉండడంతో ఆరోగ్యంగా ఉండి సకాలంలో ఎదకు రావడంతో పాటు పాల దిగుబడి సైతం బాగా పెరుగుతుందన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో పశుగ్రాసాన్ని పెంచే విధానం, శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేసే విధానంపై రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. ఎం.అలమండలో పశువైద్యాధికారి మంజుషారాణి, మామిడిపల్లిలో ప్రియాంక పశుగ్రాసం సాగు చేసే విధానంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా కొరువాడ పశువైద్యాధికారి సింహాచలంనాయుడు కొరువాడ, గవరపాలెం గ్రామాల్లో గల రైతులకు మేలు జాతి గడ్డి పెంపకం గురించి వివరించారు. పశుసంవర్ధకశాఖ ద్వారా 75 శాతం రాయితీపై ఇప్పటికే రైతులకు కాకి, మొక్క జొన్న రకం గడ్డి విత్తనాలను ఇచ్చినట్టు ఆయన తెలిపారు. సూపర్ నెపియర్, కో-4, కో-5 రకం గడ్డిని పశువులకు మేతగా ఇవ్వడం వల్ల పాల దిగుబడి పెరగడంతో పాటు వెన్నశాతం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 14 వరకూ పశు వైద్య కేంద్రం పరిధిలో గల గ్రామాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు.

అన్ని గ్రామాలకు తాగునీరు అందాలి


తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ఆదేశిస్తున్న ఎంపీపీ సర్వేశ్వరరావు

మాకవరపాలెం: అన్ని గ్రామాలకు నిత్యం తాగునీటిని సరఫరా చేయాలని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం వివిధ శాఖల అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను సభ్యులకు వివరించారు. గిడుతూరు, లచ్చన్నపాలెం గ్రామాల్లో ఉన్న భారీ తాగునీటి ప్రాజెక్టుల నుంచి మండలంలోని 31 పంచాయతీలకు నీటిని సరఫరా చేయాల్సిఉన్నా బూరుగుపాలెం ప్రాంతానికి రెండు రోజులకు ఒకసారి లచ్చన్నపాలెం ప్రాజెక్టు నుంచి తాగునీరు అందిస్తున్నారని చామంతిపురం సర్పంచ్ బొడ్డు గోవిందరావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ పంచాయతీలోని 200 మంది పెద్దిపాలెం, 50 మంది ముషిడిపాలెం వెళ్లి ప్రతినెలా రేషన్ సరుకులు తీసుకోవాల్సివస్తోందన్నారు. చామంతిపురంలోనే రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో గ్రామాల్లో తాగునీటిని నిత్యం అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, వైస్ ఎంపీపీలు రుత్తల లక్ష్మి, రాజారావు, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీపీడీవో చాయాసుధ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరమణ పాల్గొన్నారు.

కన్నులపండువగా జగన్నాథస్వామి మారు రథయాత్ర


చోడవరం జగన్నాథస్వామివారి తిరుగు రథయాత్రలో పాల్గొన్న భక్తులు

చోడవరం : జగన్నాథస్వామి వారి మారు రథయాత్ర సోమవారం వైభవంగా సాగింది. తొలి రథయాత్ర అనంతరం స్థానిక బొల్లవీధి రామాలయం ఆవరణంలో పదిరోజుల పాటు స్వామివారి దశావతార దర్శనం కార్యక్రమాలు జరిగాయి. తిరుగు రథయాత్రోత్సవాన్ని దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఆలయం వద్ద ప్రారంభమైన ఈ రథయాత్ర పెదబజార్, కోఆపరేటివ్‌కాలనీ, మెయిన్‌రోడ్డు, పీఎస్‌పేట రోడ్డు, శివాలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, కొత్తూరు జంక్షన్ మీదుగా ఇక్కడి ప్రాచీన దేవాలయమైన శ్రీ కేశవస్వామి ఆలయ ప్రాంగణం ఉపాలయంలో వేంచేసియున్న జగన్నాథస్వామి ఆలయం వరకు సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సుభద్ర, బలభద్రుడు, జగన్నాథస్వామి ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యులు, సీతారామాచార్యులు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని రథ చక్రాలపై కొబ్బరికాయలు కొట్టి స్వామివారి రథం లాగుతూ గోవింద నామస్మరణ చేశారు.

నేడు రాజన్న జయంతి


మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని, మున్సిపల్ స్టేడియంలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. దీనికి పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేశారు. పార్టీ నాయకులు ఈ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని గణేష్ పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీల, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయా మండల గామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ సూచించారు.

నేడు ఎ.కోడూరులో

కె.కోటపాడు : మండలంలో ఎ.కోడూరు గ్రామంలో మంగళవారం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ మద్దతుదారులైన సర్పంచ్, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మాడుగులలో...

మాడుగుల : స్థానిక పాత బస్టాండ్‌లో మహానేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం జరగనున్నాయని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల 29 పంచాయతీల నుంచి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఉదయం 9 గంటలకు విధిగా హాజరు కావాలని కోరారు.

చీడికాడలో...

చీడికాడ : దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చీడికాడ బస్సుస్టాండులో గల రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద జరిగే జయంతి కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అనుబంధ సంఘాల నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

మహానేత జయంతి వేడుకలకు ఏర్పాట్లు


వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు

నాతవరం : దివంగత మహానేత వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నాతవరం గ్రామంలో మంగళవారం నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదేశాల ప్రకారం రాజన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల కేంద్రంలో గల ప్రధాన కూడలి జంక్షన్‌లో గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామన్నారు. తర్వాత కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు విధిగా హాజరుకావాలన్నారు.

మెగా పేరెంట్స్ డే విధివిధానాలపై సమావేశం


మాడుగుల జెడ్పీ బాలుర పాఠశాలలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్


కె.కోటపాడులో పీఎంసీ సభ్యులతో సమావేశం

మాడుగుల రూరల్ : మాడుగుల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సోమవారం ఎంఈవోలు బి.దేముడమ్మ, పాండురంగారావు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వాహించారు. ఈ నెల 10వ తేదీన మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో అనుసరించాల్సిన విధివిధానాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్ హెచ్‌ఎంల నుద్దేశించి మాట్లాడారు. ఎంపీడీవో అప్పారావు, తహసీల్దారు రమాదేవి పాల్గొన్నారు.

కె.కోటపాడు : గుల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 10న ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రాధానోపాధ్యాయుడు ఎన్.వీరాంజనేయులు తెలిపారు. పాఠశాలలో సోమవారం పీఎంసీ సభ్యులతో మెగా పేరెంట్స్‌డే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యానర్థి తల్లిదండ్రులు ఈ సమావేశానికి ఉదయం 9 గంటలకు హజరుకావాలని కోరారు. సమావేశంలో తల్లిదండ్రులకు విద్యార్థులతో పాదపూజ చేయడంతో పాటు విద్యార్థి చదువులు గురించి ఉపాధ్యాయులు వివరించడం జరుగుతుందని తెలిపారు. అలాగే విద్యార్థి ఆరోగ్య వివరాలు కూడా మెడికల్ సిబ్బంది తెలుపుతారన్నారు. పీఎంసీ కమిటీ చైర్మన్ బి.మహలక్ష్మి, ఉపాధ్యాయురాలు నీలిమ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటాం


వెలుగు కార్యాలయంలో సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ సభ్యులు

రావికమతం: డిమాండ్ల సాధనకు ఈ నెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటామని వెలుగు విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ)లు సోమవారం వెలుగు ఏపీఎంకు సమ్మె నోటీసు ఇచ్చారు. సీఐటీయు ఆధ్వర్యంలో అసంఘటిత రంగాల కార్మికుల డిమాండ్ల సాధనకు ఈ నెల 9న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా తాము కూడా ఒక్కరోజు సమ్మెలో పాల్గొంటామని మండల వీవోఏల సంఘ అధ్యక్షురాలు గెంజి సత్యవతి తెలిపారు. తమ విధులకు సంబంధించి కాల పరిమితిపై ఇచ్చిన జీవో ఉపసంహరించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని,గ్రూప్ ఇన్సూరెన్స్ వర్తింపచేయాలని, రాజకీయ నాయకుల వేధింపుల నుంచి కాపాడాలని కొంత కాలంగా తాము వివిధ రకాలుగా నిరసనలు తెలియజేసినా ప్రభుత్వం పట్టించుకోనందున సమ్మెలో పాల్గొంటున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కన్వీనర్ వజ్రపు సత్యవతి, వీవోఏలు పాల్గొన్నారు.

రేపు దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

చీడికాడ : ఈ నెల 9వ తేదిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చెయ్యాలని కోరుతు సోమవారం సిటు నాయకులు నానిబాబు, రొంగలి దేముడునాయుడు, దోర, నాగిరెడ్డి సత్యనారాయణ, ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. చీడికాడ, తురువోలు, చీడిపల్లి, అర్జునగిరి, చుక్కపల్లి, వరహాపురం, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.